RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

దిన పత్రిక

నేటి మనిషి..!
సమయాన్ని బట్టి మాటను
అవసరాన్ని బట్టి ఆటను
సందర్భాన్ని బట్టి నటనను
పండించగల బహుముఖ
ప్రజ్ఞాశాలి

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 220
ఆదివారం, జులై 26, 2026 , పేజీలు - 4 వెల : 2/-

# ప్రధాని మోదీ వరల్డ్ రికార్డ్..

## ఫిఫా రికార్డును బ్రేక్ చేసిన వీడియో..

న్యూఢిల్లీ :ప్రధాని మోదీ నీట్ 2026 పేపర్ లీకేజీ అంశంపై విద్యార్థులను ఉద్దేశించి పోస్ట్ చేసిన వీడియో రికార్డ్ సాధించింది. సోషల్ జెన్-జీ స్టైల్ సెల్ఫీ వీడియో మీడియాలో సరికొత్త వరల్డ్ రికా ర్డును నమోదు చేసింది. ఈ వీడియో కేవలం 24 గంటల్లోనే 335 మిలియన్ (30.3 కోట్ల) వ్యూస్ సాధించింది.భారత ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త వరల్డ్ రికార్డ్ సృష్టించారు. ఫిఫా వీడియోకు ఉన్న రికార్డును ప్రధాని బద్దలు కొట్టారు. ప్రధాని మోదీ గురువారం అర్ధరాత్రి నీట్ పరీక్షా పత్రాల లీకేజీ అంశంపై విద్యార్థులను ఉద్దేశించి వీడియో పోస్ట్ చేశారు. ప్రధాని ఈ జెన్-జీ స్టైల్ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో రికార్డులు సృష్టిస్తోంది. మోదీ ఈ ఒక్క రీల్‌తో ప్రపంచ సోషల్ మీడియా



రికార్డులన్నీ తిరగరాశారు. ఈ వీడియో పోస్ట్ చేసిన కేవలం 24 గంటల్లోనే 335 మిలియన్ (30.3 కోట్లు) వ్యూస్ వచ్చాయి. వరల్డ్ ఫేమస్ యూట్యూబర్ 'ఐషో స్పీడ్' 2026 ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్ కోసం చేసిన వీడియో పేరుతో ఉన్న 30 కోట్లు (300 మిలియన్లు) వ్యూస్ రికార్డును ప్రధాని బద్దలు కొట్టారు.ప్రధాని పోస్ట్ చేసిన ఈ ఒక్క వీడియోతో మోదీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌కు 24 గంటల్లో ఏకంగా 1 మిలియన్ (10 లక్షలు) కొత్త ఫాలోవర్లు కూడా వచ్చారు. ఇప్పు టికే ప్రధాని మోదీకి ఇన్‌స్టాలో 10.3 కోట్లు (103 మిలియన్లు) ఫాలోవర్లతో ప్రపంచంలోనే అత్యధిక ఆదరణ కలిగిన నంబర్ వన్ గ్లోబల్ లీడర్‌గా ఉన్నారు. ప్రధాని మోదీ ఇన్‌స్టాలో గురు వారం అర్ధరాత్రి పోస్ట్ చేసిన ప్రసంగాన్ని మొదలు పెట్టారు.

## రూ.6 లక్షలకే ఫ్లాట్,

# ప్రభుత్వం బంపరాఫర్



హైదరాబాద్:తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ పరిధిలో ఇం దిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగ వం తం చేస్తోంది. తాజాగా సీఎం రేవంత్ చేసిన సమీక్షలో అధికారులకు కీలక దిశా నిర్దేశం చేసారు. అందులో భాగంగా మధ్య తరగతి కుటుంబాలకు తీపి కబురు అందించారు. క్యూర్ పరిధిలో రూ 11 లక్షలో నిర్మించే ఫ్లాట్ ను రూ 6 లక్షలకే అందించాలని డిసైడ్ అయ్యారు. ఈ మేరకు మార్గదర్శకాలు.. అర్హతలు ఖరారు చేసారు.మధ్య తరగతి ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం ఆసక్తికర నిర్ణయాన్ని వెల్లడి ంచింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో 'ఇందిరమ్మ ఇండ్లు' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాలకుగాను తొలి విడతగా 16 నియోజక వర్గాల్లో ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. పైలట్ ప్రాజెక్టుగా నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున నిర్మాణం చేపట్టనుంది.

## ఇందిరమ్మ టవర్స్‌కు హెల్ప్‌లైన్

# ప్రారంభం



హైదరాబాద్: క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ గృహాల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారం భించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభిం చారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కాల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో దరఖాస్తుదారులకు సమాచారం అందించనున్నారు.దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేస్తూ, ఆధార్ కార్డు ఒక్కటే సరిపోతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో ఇతర పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే, రూ.10 వేల ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమే

## : మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జులై 25: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ ఉద్యమానికి దక్కిన విజయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లపై కేంద్రం దిగివచ్చిందని, ఈ పరిణామం ప్రభుత్వా లకు ఒక కనువిప్పుగా మారాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి దక్కిన విజయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు కోసం దేశవ్యాప్తంగా వ్యక్తమైన ఆందోళనల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ఆయన అన్నారు.విద్యార్థుల ఆవేదనను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు గురైందని, చివరకు ప్రజల ఒత్తిడి ముందు తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదని, ప్రజల గొంతుకకు లభించిన గౌరవమని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ప్రజా



సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ప్రభుత్వమైనా మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ రోజు దిగివచ్చిన ప్రభుత్వం రేపు గద్దె దిగక తప్పదని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆకాంక్షలను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి 100 రోజుల

# యాక్షన్ ప్లాన్ సిద్ధం

## : మంత్రి సీతక్క

హైదరాబాద్, జులై 25: మిషన్ భగీరథపై మంత్రి సీతక్క ఈరోజు(శనివారం) రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్యలు రాకుండా 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉందన్నారు. సింగూరు, పాలేరు నీటి నిల్వలపై నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోజువారీ రిజర్వాయర్ల నీటిమట్టాలను సమీక్షిం చాలని సూచించారు. స్థానిక నీటి వనరులను వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. బోర్‌వెల్స్ వద్ద రీఛార్జింగ్ పిట్స్, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ పనులు వేగవంతం



చేయాలని తెలిపారు. గ్రామాల వారీగా వాట్సాప్ గ్రూపులతో నీటి సరఫరాపై సమాచారం అందించాలని మంత్రి సూచనలు చేశారు. మహిళా సంఘాలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల సమన్వయంతో నీటి నిర్వహణ చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకూడదని మంత్రి స్పష్టం చేశారు.దేశవ్యాప్తంగా ఎల్‌నీనో పరిస్థితులు ఉన్నాయని.. ఆ ప్రభావం తెలంగాణ మీద కూడా ఉందని మంత్రి తెలిపారు. మిషన్ భగీరథ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిం నున్నట్లు తెలిపారు. అశ్రద్ధ, అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని.. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 16వ ఆర్థిక సంఘం నిధులను తాగునీటి అవసరాల కోసం వెచ్చిం చుకోవచ్చని తెలి పారు. తాగునీటికి ఇచ్చిందన్నారు.

## కాళేశ్వరం బ్యారేజీల నిర్వహణపై

# కేంద్రానికి లేఖ



హైదరాబాద్, జూలై 24 : కాళేశ్వరం బ్యారేజీలపై కేంద్ర జలశక్తి శాఖ, ఎన్‌డీఎస్‌ఏ చేసే సిఫారసులను రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తు ందని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్త మ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు కాళే శ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నా రం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై స్పష్టమైన సాంకేతిక మార్గదర్శకాలు ఇవ్వాలని కోరుతూ.. కేంద్ర జలశక్తి శాఖ, జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ)లకు లేఖలు రాయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు మూడు బ్యారేజీలను ప్రస్తుతం ఫ్రీ-ఫ్లో (నీటి ప్రవాహం సజావుగా కొనసాగే) స్థితిలో ఉంచా మన్నారు. బ్యారేజీల్లో మళ్లీ నీటిని నిల్వ చేయాలా...వద్దా...? పంపింగ్ చేపట్టాలా... వద్దా...? అనే అంశాలపై లిఖితపూర్వకంగా ఆయా విభాగాలు అభిప్రాయం తెలిపిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. కేంద్రానికి రాసే లేఖకు ఇప్పటిదాకా జోడించాలన్నారు.

# ఇది ఎవరికీ ఓటమి కాదు..

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై రాహుల్ కామెంట్



న్యూఢిల్లీ :కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం రాహుల్ గాంధీ స్పందించారు. ఇది ఎవరికీ ఓటమి కాదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా లభించిన విజయమని అన్నారు. విద్యారం గంలో సంస్కరణలు, బాధ్యతా యుత వైఖరిని వారు పట్టుబట్టి సాధిం చుకు న్నారని అ న్నారు. అయితే, ప్రభుత్వంపై తమ పోరా టం మాత్రం కొనసాగుతుందని అన్నారు.'భారత విద్యారంగం మనందరికీ గర్వకారణంగా ఉండేది. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు దక్కేవి. కానీ ఏళ్ల కొన్నేళ్లుగా ప్రైవేటీకరణ చొచ్చుకొచ్చింది. ఇందుకు ప్రతిస్పందనగానే తాజా పరిణామాలు చోటుచేసు కున్నాయి. వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఇకపై గట్టి చర్యలు తీసుకోవాలి' అని రాహుల్ గాంధీ అన్నారు.వ్యవస్థలో లోపాలకు ధర్మేంద్ర ప్రధాన్ ఒక చిహ్నం మాత్రమేనని రాహుల్ గాంధీ అన్నారు. ఏ ఒక్క మంత్రినో టార్గెట్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టలేదని అన్నారు. వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి కోసమే ఆందోళనకు దిగారని అన్నారు.ఇక నిరసనల సందర్భంగా కట్టుతప్పిన పోలీసులపై అందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. విద్యార్థులకు ప్రధాని కూడా క్షమాపణ చెప్పాలని అన్నారు. హోం మంత్రి అమిత్ షాపై కూడా రాహుల్ గాంధీ మండిపడ్డారు. నిరసనల్లో హింసాత్మక ఘటనలకు అమిత్ షానే కారణమని ఆరోపించారు.

## నేను సచివాలయానికే పరిమితం కాను..

# సామాన్యుడిలా ప్రజల్లో ఉంటా

## : సీఎం చంద్రబాబు

కర్నూలు, జులై 25: తాను సచివాలయానికే పరిమితం కాకుండా సామాన్యుడిలా ప్రజల మధ్యలోనే ఉంటానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లాలోని ఆస్పరిలో సీఎం చంద్రబాబు పర్యటించి 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లను క్రమం తప్పకుండా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేదరికాన్ని నిర్మూలించడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించిన సీఎం.. వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుంటే ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం



ఉండదని హితవు పలికారు. సాంకేతికతను జోడిస్తూ 'ఏఐ డాక్టర్' సేవలను అందుబాటులోకి తెచ్చి, ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను డిజిటలైజ్ చేస్తామని వెల్లడించారు. అలాగే భూ హక్కులకు భద్రత కల్పించేందుకు 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆలోచించి పంటలు వేయాలని విజ్ఞప్తి చేస్తూనే, ఆలూరు ప్రాంతంలో తాగునీరు, రోడ్ల సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.రాయలసీమ సస్యశ్యామలానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించిన చంద్రబాబు, వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తరలిస్తామని హామీ ఇచ్చారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును, 2028 నాటికి రాయలసీమ స్టీల్ ఫ్యాక్టరీని పూర్తి చేస్తామని స్పష్టమైన గడువు విధించారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని విమర్శిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# హైకోర్టు స్టేతో తిరిగి పదవి చేపట్టిన సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి

- నా బలం, నా ధైర్యం నా గ్రామ ప్రజలే సర్పంచ్ రాజ్యలక్ష్మి స్వామి
- పొలంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం.







**చేగుంట జూలై 26 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం పోలంపల్లి గ్రామ సర్పంచిగా కొండి రాజలక్ష్మి స్వామి,వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ నాపై కొందరు రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా, తప్పుడు ఫిర్యాదులు చేసి అధికారులను తప్పుదోవ పట్టించారు. ఒక దళిత మహిళా సర్పంచ్ అయిన నన్ను టార్గెట్ చేస్తూ, మెదక్ జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రతిమ సింగ్ 10-07-2026న నన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సస్పెన్షన్‌ను కక్షపూరితంగా భావించి, నేను రాష్ట్ర హైకోర్టులో న్యాయ పోరాటానికి పిటిషన్ దాఖలు చేశాను. హైకోర్టు నా వాదనలు విని, కలెక్టర్ కు యదావిధిగా సర్పంచ్ ఉత్తర్వులు మంజూరు చేసింది.హైకోర్టు ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య నాపై విధించిన సస్పెన్షన్‌ను తొలగిస్తూ, యథావిధిగా విధులు కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేశారు.ఈ న్యాయ పోరాటంలో నాకు ప్రతిక్షణం అండగా నిలిచిన రాష్ట్ర న్యాయ నిపుణులు అడ్వకేట్ నరేష్,అన్నకు ఎప్పటికప్పుడు నాకు తోడుగా నిలచిన గ్రామ పెద్దలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.నాపై నా గ్రామ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయను. ప్రజల ఓటుతో ఎన్నికైన గ్రామ సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధినే లక్ష్యంగా పనిచేస్తాను. నా బలం, నా ధైర్యం నా గ్రామ ప్రజలే.కొన్ని దుష్ట శక్తులు నేను దళిత మహిళను అని కూడా చూడకుండా, చాలా సందర్భాల్లో అవమానపరుస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తూ తప్పుడు ఫిర్యాదులు చేశారు. న్యాయ పోరాటంలో నేను ఎంతటిదానో వారికి తెలిసొచ్చింది.ఇప్పటి నుండి పొలంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం.24 గంటలు ప్రతి సంక్షేమ పథకాన్ని నా గ్రామ ప్రజలకు చేరే వరకు ప్రతి వీధిని, ప్రతి వార్డును తిరుగుతాను. ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తాను.గ్రామ ప్రజల ఆశీస్సులతో గ్రామ అభివృద్ధి కోసం పనిచేస్తాను. ఇక నాపై తప్పుడు ఫిర్యాదులతో వస్తే, చట్టపరంగా సరైన గుణపాఠం చెప్తాను అని హెచ్చరిస్తున్నాను. అని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ వెంకటేష్ మాజీ సర్పంచ్ కొండి మల్లేశం పి రాజు, కుమారి యాదగిరి, యాటసత్యం, మారబోయిన ఐలయ్య, యాట ఆంజనేయులు,

# భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు..

- బీరంగూడ గుట్ట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు!
- గంట నుండి రెండు గంటల సమయం పడుతున్న దర్శనం
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు: ప్రధాన అర్చకుడు నానాజీ




**అమీన్ పూర్ జూలై 25:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

పవిత్రమైన తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అనంత ఆలయం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల విపరీతమైన రద్దీ కారణంగా స్వామివారి దర్శనానికి సుమారు గంట నుండి రెండు గంటల సమయం పడుతోందని ఆలయ ప్రధాన అర్చకులు నానాజీ వెల్లడించారు.ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు నానాజీ మీడియాతో మాట్లాడుతూ... తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు మరియు విశేష అభిషేకాలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. భక్తుల రద్దీని పూర్తిగా దృష్టిలో పెట్టుకుని, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులందరం ప్రత్యేక చొరవ తీసుకున్నామని చెప్పారు. క్యూ లైన్లలో నిలబడే భక్తులకు తాగునీరు తదితర సౌకర్యాలు కల్పిస్తూ, ప్రశాంత వాతావరణంలో స్వామివారి దర్శనం జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.

# రెడ్డిపల్లి లో జలసిరి పథకంపై గ్రామసభ భూగర్భ జలాల పెంపునకు అధికారుల కృషి

ప్రజలందరూ భాగస్వాములు కావాలి జడ్పీసీఈఓ ఎల్లయ్య






**చేగుంట జూలై 25 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో జలసిరి (వి బి జి రాంజీ) పథకంపై రెడ్డిపల్లిలోగ్రామసభ నిర్వహించడం జరిగినదిభూగర్భ జలాల సంరక్షణకు ప్రజలందరూ భాగస్వాములు కావాలి జడ్పీసీఈఓ ఎల్లయ్య అన్నారుతెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలసిరి (వి బి జి రామ్ జి) పథకంలో భాగంగా, భూగర్భ జలాలను పెంచి, వర్షపు నీటిని సంరక్షించే లక్ష్యంతో చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఇంకుడు గుంతలు, ఫారం పౌండ్, బోర్వెల్ రీఛార్జ్, కమ్యూనిటీ సోక్ పిట్, మ్యాజిక్ డ్రైన్ వంటి పనుల ప్రాముఖ్యతను అధికారులు గ్రామస్తులకు వివరించారు.గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి (జడ్పీసీఈఓ ) ఎల్లయ్య మాట్లాడుతూ, "రాష్ట్రంలో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించడానికే ప్రభుత్వం జలసిరి పథకాన్ని తీసుకువచ్చింది. ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు, వాటర్ హార్వెస్టింగ్ పనులు చేపట్టి, వచ్చే 5 సంవత్సరాల్లో భూగర్భ జలాలను పెంచడం మన లక్ష్యం. ఈ పనుల్లో గ్రామస్తులు, ఎస్ హెచ్ జి మహిళలు చురుగ్గా పాల్గొనాలి" అని పిలుపునిచ్చారు.చేగుంట ఎంపీడీఓ గారుమాట్లాడుతూ, గ్రామ పంచాయతీ నిధులతో పాటు, ప్రభుత్వం నుండి వచ్చే గ్రాంట్లతో పనులను శాశ్వతంగా చేపడతామని తెలిపారు. ఎంపీవో సాంకేతిక అంశాలను వివరించారు.సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామసభలో తీసుకున్న నిర్ణయాల మేరకు త్వరలోనే గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో పనులు ప్రారంభిస్తామని, ప్రతి ఇంటికి నీటి భద్రత కల్పించడమే తమ ధ్యేయమని అన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పాలకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎస్ హెచ్ జి మహిళలు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఆషాఢ మాస గోరింటాకు వేడుకలు






**శేర్లింగంపల్లి, జూలై 25: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని చందానగర్ శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు వేడుకలను ప్రధానోపాధ్యాయిని మరియు ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ ప్రత్యేక వేడుకల్లో విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా పాల్గొని, తమ చేతులకు మురిపెంగా గోరింటాకు అలంకరించుకున్నారు. ఆషాఢ మాస విశిష్టత, మన సంప్రదాయాల్లో గోరింటాకుకున్న ప్రాధాన్యం గురించి ఉపాధ్యాయులు విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేలా ఎంతో ఆకట్టుకునేలా సాగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. విద్యార్థినుల కేరింతలు, సాంస్కృతిక సందడితో వేడుకలు అంబరాన్ని తాకాయి. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమిష్టి కృషితో ఈ కార్యక్రమం విజయవంతమైంది.

# నీటి క్వారీలో బోర్ మోటార్ దింపుతుండగా ప్రమాదవశాత్తు రైతు మృతి

**కొల్చారం,జూలై 25, ( మెదక్ టుడే న్యూస్):**

మెదక్ జిల్లా కొల్చారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన రైతు ఉసికె కిషన్ (64) ప్రమాదవశాత్తు నీటి క్వారీలో మునిగి మృతి చెందిన విషాద సంఘటన శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, రాంపూర్ గ్రామానికి చెంది న ఉసికె రాజశేఖర్ తన తండ్రి ఉసికె కిషన్‌తో కలిసి శనివారం ఉదయం తమ వ్యవసాయ భూమి పక్కన ఉన్న నీటి క్వారీ వద్ద బోర్ మోటార్‌ను నీటిలో దింపేందుకు వెళ్లారు. ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో ఉసికె కిషన్ నీటి క్వారీలోకి దిగి బోర్ మోటార్‌ను దింపుతున్న సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి మునిగిపోయారు.ఇది గమనించిన కుమారుడు రాజశేఖర్ వెంటనే నీటిలోకి దిగి తన తండ్రిని బయటకు తీసుకువచ్చి 108 అంబులెన్స్ ద్వారా మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అయితే ఆసుపత్రిలో డ్యూటీ వైద్యుడు మధ్యాహ్నం సుమారు 12:15 గంటలకు పరీక్షించి అప్పటికే కిషన్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు.మృతుడి కుమారుడు ఉసికె రాజశేఖర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో, బోర్ మోటార్‌ను నీటిలో దింపే సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి మునిగి త తండ్రి మరణించారని, ఈ ఘటనపై తమకు ఎలాంటి అనుమానం లేదని పేర్కొంటూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





# జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి:

రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క.




**మెదక్,జూలై,25,మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి)** జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, ఇతర అధికారులతో కలిసి అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులతో శనివారం సాయంత్రం జలసిరి కార్యక్రమం,విబిజి రామ్ జి పనులు, గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈసందర్భంగామంత్రిమాట్లాడుతూ,ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జలసిరి కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేయాలన్నారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత,ప్రతి పంటకు పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట, కానీ నినాదంతో భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు ప్రారంభించామని అన్నారు.ప్రతి రైతు తమ పొలాలలో ఫామ్ పాండ్ నిర్మించుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలన్నారు.రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల సంరక్షణసాధ్యమవుతుందని తెలిపారు.విబిజి రామ్ జి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులలో దేశంలోనే ముందువరుసలో ఉన్నామని అన్నారు. అర్హులైన ప్రతి పేద కూలీలందరికీ పని దినాలు కల్పించాలని ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈవో ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

**- అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్,జూలై,25,మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి)** ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శనివారం జిల్లాలోని మాసాయిపేట మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి ఏడి ల్యాండ్ సర్వే కిషన్ ,మండల తహసిల్దార్ తో కలిసి అదనపు కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,భూముల సర్వే, రీ సర్వే తో భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని, భవిష్యత్తులో భూమి వివాదాలు లేకుండా రికార్డులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని,తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు.పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.సర్వే ప్రక్రియ సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని,ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలుతీసుకుంటున్నామని తెలిపారు.ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు.భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు. తర్వాత మార్పులు కష్టతరమని, భూములకు సంబంధించి స్పష్టమైన వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. అనంతరం పోతంశెట్టిపల్లి గ్రామంలో చెరువు సి ఖశీ భూమిని అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించి ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని తగు చర్యలు తీసుకోవాలని తాసిల్దార్లను ఆదేశించారు.ఈకార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్, మాసాయిపేట తాసిల్దార్ రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుపై అనుమానాలా - ఈ నెంబర్‌కు కాల్ చేయండి



**హైదరాబాద్** :ప్రజాప్రభుత్వంలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్స్‌పై వస్తున్న సందేహాల నివృత్తికి ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్‌ను గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. హౌసింగ్ బోర్డు కార్యాలయంలో ప్రారంభించిన హెల్ప్‌లైన్ సెంటర్‌లో పథకంపై ప్రజల్లో ఎలాంటి గందరగోళం, అపోహలు లేకుండా దరఖాస్తు విధానం, అర్హతలు, అవసరమైన పత్రాలు, చెల్లింపులు, కేటాయింపు విధానం తదితర అంశాలపై పూర్తి సమాచారం అందిస్తారని మంత్రి తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలు ఉన్నా మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా 040-24603572 నంబర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఫోన్ చేసి అధికారిక సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు.దరఖాస్తుదారుడి నిబంధనలు ఇవే : దరఖాస్తు దారుల సౌకర్యార్థం తెలుగు , హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో సమాచారం తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుంచి సరైన సమాచారం అందించేందుకు ఈ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. దరఖాస్తుదారు క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివాసం ఉండాలని, దరఖాస్తుదారు లేదా కుటుంబానికి ఓఆర్ఆర్, క్యూర్ పరిధిలో సొంత ఇల్లు లేదా ఫ్లాట్ ఉండకూడదని, ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు, ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయింపు ఉంటుందని మంత్రి వివరించారు.ఆన్?లైన్? పోర్టల్?, వాట్సప్? ద్వారా దరఖాస్తు : క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా తొలి విడతలో 16 నియోజకవర్గాలలో 7680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఏ నియోజకవర్గానికి చెందిన ప్రజలు అదే నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. దరఖాస్తు దారులు ఎలాంటి విష ప్రచారాలను నమ్మకూడదని మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్,వాట్సప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

చెల్లింపునకు యూపీఐ లేదా నెట్? బ్యాంకింగ్?? : హైదరాబాద్ క్యూర్ ఏరియా ప్రాంతంలో నివసిస్తున్న అల్పాదాయ వర్గాల కుటుంబాల కోసం ఈ పథకాన్ని రూపొందించామని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల వరకు ఉండాలని, ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరించి అర్హత కలిగిన కుటుంబానికి ఒక ఫ్లాట్? మాత్రమే కేటాయిస్తారని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. అందిన దరఖాస్తులను డిజిటల్ విధానంలో పరిశీలించడంతో పాటు, క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర ధృవీకరణ నిర్వహిస్తామన్నారు. నిర్మిస్తున్న ఫ్లాట్ల సంఖ్య కంటే అర్హులైన దరఖాస్తుదారుల సంఖ్య ఎక్కువగా ఉంటే, పారదర్శకమైన విధానంలో లాటరీ ద్వారా ఇళ్లను కేటాయిస్తామని తెలిపారు.ఇల్లు మంజూరు కాకపోతే డబ్బులు వాపసు : దరఖాస్తు సమయంలో రూ.10 వేలు చెల్లింపునకు యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్‌ను మాత్రమే ఉపయోగించాలని, ఒక వేళ ఇల్లు మంజూరు కాకపోతే తిరిగి అదే ఖాతాకు ఆ మొత్తం వాపసు అవుతుందన్నారు. పరిశీలన, కేటాయింపు, వాపసు తదితర సమాచారం పూర్తయ్యేవరకు మీసేవ రశీదు, చెల్లింపు రశీదు, దరఖాస్తు సంఖ్య, మొబైల్ నంబర్‌లను యాక్టివ్‌గా ఉంచుకోవాలని మంత్రి సూచించారు.రూ.5 లక్షల సబ్సిడీతో స్థలం : ఈ పథకం కింద ప్రతిపాదించిన ఫ్లాట్లు ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక్కో ఫ్లాట్ ఖరీదు రూ.40-60 లక్షల వరకు ఉంటుందని, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీతో పాటు అన్ డివైడెడ్ షేర్ కింద 20-25 గజాల స్థలాన్ని కూడా లబ్ధిదారుని పేరిట రిజిస్ట్రేషన్ చేపడుతుందన్నారు. లబ్ధిదారుడు కేవలం రూ.6 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హౌసింగ్ బోర్డు సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో 80 శాతం ఓటర్ జాబితా నమోదు లక్ష్యంగా పనిచేయాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**- అమీన్‌పూర్ పీజీఆర్ కాలనీలో ఘనంగా ఎస్ఐఆర్ ఓటర్ జాబితా నమోదు, సవరణ కార్యక్రమం**
**- 15-20 మంది వాలంటీర్లు, 20 ల్యాప్‌టాప్‌లతో ప్రత్యేక శిబిరం ఏర్పాటు**
**- మాజీ కౌన్సిలర్ కొత్తపల్లి మహదేవ్ రెడ్డి చొరవ అభినందనీయం**





**అమీన్‌పూర్, జూలై 25: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
పటాన్‌చెరు నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్ జాబితా రూపకల్పన, పరిశీలన ప్రక్రియలో వేగం పెంచి, రాబోయే రోజుల్లో 80 శాతం ఓటర్ జాబితా నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని పీజీఆర్ కాలనీలో శనివారం రోజున 5వ వార్డు మాజీ కౌన్సిలర్ కొత్తపల్లి మహదేవ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ ఓటర్ జాబితా నమోదు మరియు సవరణ ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏకంగా 15 నుండి 20 మంది వాలంటీర్లను, 20 ల్యాప్‌టాప్‌లను అందుబాటులో ఉంచి ఈ శిబిరాన్ని నిర్వహించడం చాలా అభినందనీయమని మహదేవ్ రెడ్డిని కొనియాడారు.

**ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రసంగంలోని ముఖ్య అంశాలు:**
80% నమోదు లక్ష్యం: అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో చేరేలా ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.యువత భాగస్వామ్యం: అర్హత కలిగిన యువత, కొత్త ఓటర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓటు హక్కు నమోదు చేసుకోవాలి.ప్రభుత్వ సేవలు: స్థానిక అధికారుల సహకారంతో ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందేలా ప్రజాప్రతినిధులు నిరంతరం శ్రమించాలి.

**ఆగస్టు 3 వరకు అవకాశం -- జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్:**
కార్యక్రమంలో పాల్గొన్న జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు 56% ఓటర్ జాబితా ప్రక్రియ పూర్తయిందని, ఇంకా 10 రోజుల సమయం ఉందన్నారు. పీజీఆర్ కాలనీలో ప్రజల సౌకర్యార్థం రెండు రోజుల పాటు (ఈరోజు, రేపు) ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది, వాలంటీర్లు కలిపి 50 నుండి 60 మంది ఈ కార్యక్రమంలో సేవలందిస్తున్నారని తెలిపారు.

**ఎమ్మెల్యే గారి ఆదేశాల మేరకే ప్రత్యేక శిబిరం -- మాజీ కౌన్సిలర్ కొత్తపల్లి మహదేవ్ రెడ్డి:**
మాజీ కౌన్సిలర్ కొత్తపల్లి మహదేవ్ రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారి సూచనల మేరకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పీజీఆర్ కాలనీలో మొత్తం 8,000 ఓట్లు ఉండగా, ఇప్పటి వరకు 3,500 ఓట్ల ప్రక్రియ మాత్రమే పూర్తయిందని చెప్పారు. ఆగస్టు 3వ తేదీ వరకు అవకాశం ఉన్నందున కాలనీవాసులందరూ ఈ ప్రత్యేక శిబిరాన్ని ఉపయోగించుకుని ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, స్థానిక మాజీ కౌన్సిలర్లు, కృష్ణ, బిజిలి రాజు, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు ప్రమోద రెడ్డి, జగదీష్,శేఖర్,దాసి యాదవ్, ఐలాపూర్ నర్సింగ్ రావు, వాలంటీర్లు, కాలనీవాసులు మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**- అమీన్పూర్‌లో రూ.80 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రథమ ప్రాధాన్యత.**





**అమీన్ పూర్ జూలై 25:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్పూర్ పరిధిలోని ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు.శనివారం అమీన్పూర్ డివిజన్‌లోని ఆర్ఆర్ హోమ్స్, ఎస్ఎస్ అపార్ట్‌మెంట్, దుర్గా హోమ్స్ కాలనీలలో రూ.80 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు.అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నూతన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు.అమీన్పూర్‌లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పైప్‌లైన్ విస్తరణ పనులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతులను కల్పించి, అమీన్పూర్‌ను ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ కౌన్సిలర్స్ చంద్రకళ గోపాల్, కృష్ణ, బిజిలి రాజు,ప్రమోద్ రెడ్డి, జగదీష్, చంద్రశేఖర్, రుశ్వంత్ రెడ్డి, దాసు యాదవ్, అలాగే ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతి నిధులు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా 'షీ టీమ్స్' అవగాహన సదస్సు.

**పటాన్‌చెరు జులై 25:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
పటాన్‌చెరు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినుల రక్షణ, చట్టపరమైన హక్కులు మరియు సమగ్ర భద్రతను లక్ష్యంగా చేసుకుని 'షీ టీమ్స్' విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఒక విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు 'షీ టీమ్స్' బృందం నుండి ఉప నిరీక్షకులు శ్యామ్‌సుందర్ మరియు ప్రధాన కానిస్టేబుల్ శివశంకర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి, ప్రస్తుత సమాజంలో మహిళలు మరియు విద్యార్థుల భద్రతా ప్రాముఖ్యతను వివరించారు. గూఢచార మరియు భద్రతా కోణంలో గతంలో జరిగిన కొన్ని చేదు ఘటనలను ప్రస్తావిస్తూ, ఆపద సమయంలో విద్యార్థినులు ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో తగు సూచనలు చేశారు.చిన్నపిల్లల రక్షణ కోసం ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 'లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం' విశిష్టతను తెలపడంతో పాటు, 'మంచి స్పర్శ - చెడు స్పర్శ' మధ్య తేడాలను ఉదాహరణలతో విద్యార్థులకు స్పష్టం చేశారు. వేధింపులు ఎదురైనప్పుడు విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మౌనంగా ఉండకుండా ధైర్యంగా స్పందించాలని పిలుపునిచ్చారు.అలాగే, సోషల్ మీడియాను అనవసరంగా వినియోగించడం ద్వారా జరిగే నష్టాలను, సైబర్ నేరగాళ్ల వలలను వివరిస్తూ విద్యార్థులు చదువుపై మాత్రమే దృష్టి పెట్టాలని కోరారు. "మత్తు పదార్థాల రహిత తెలంగాణ" సాధనలో యువత భాగస్వామ్యం కావాలని, మైనర్లు వాహనాలు నడపకుండా రహదారి భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని హెచ్చరించారు.కళాశాలకు వెళ్లే మార్గాల్లో లేదా బహిరంగ ప్రదేశాలలో ఆకతాయిల వేధింపులు ఎదురైతే భయపడకుండా 'షీ టీమ్స్'ను ఆశ్రయించాలని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, ఆకతాయిల భరతం పడతామని భరోసా కల్పించారు. అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన సహాయక ఫోన్ నంబర్లను ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు ఆర్. వేంకటేశ్వరరావు మాట్లాడుతూ... విద్యార్థులు చట్టాలు, తమ హక్కులు మరియు సామాజిక బాధ్యతలపై అవగాహన కలిగి ఉండటం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. విద్యార్థులకు ధైర్యాన్ని, భద్రతా





మెళకువలను నేర్పిన 'షీ టీమ్స్' అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ అవగాహన సదస్సులో 'షీ టీమ్స్' బృందంతో పాటు కళాశాల అధ్యాపకులు, ఇతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలిగా మారిన కలెక్టర్ ప్రతిమా సింగ్

**పాఠాలు బోధించి సామర్థ్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్.**

**అన్ని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలి.**

**భోజనం, చదువు, క్రీడలు ప్రతి విద్యార్థి దినచర్యలో ఉండాలి**





**చేగుంట జూలై 25 మెదక్ టుడే న్యూస్** శనివారం జిల్లాలోని చేగుంట మండల పరిధిలో రెడ్డిపల్లి లో గల కేజీబీవీని జిల్లా కలెక్టర్ ప్రతి మా సింగ్ సందర్శించారు. ముందుగా 06,07 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు, 08 వరకు టేబుల్స్ చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారువిద్యార్థి దశ నుంచి క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలని, అప్పుడే భవిష్యత్ కు మంచి మార్గం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. అనంతరం 10వ తరగతిలో అన్ అకాడమీ తరగతులను పరిశీలించారు, ఫాస్ట్ మ్యాథ్స్, గెట్ ఇట్ రైట్ పుస్తకాల ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు కొన్ని కంప్యూటర్లు మరమ్మతులు గురి కాబడినవని కలెక్టర్ తెలుసుకొని వెంటనే బాగు చేయించి అందరికీ ఆన్ అకాడమీ అందుబాటులోతీసుకురావాలన్నారు. వంట గదిలోకి వెళ్లి, , వంట సరకులను, సిద్ధం చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు..డైట్ చార్ట్ ప్రకారం వంటలు చేశారా? లేదా? అని అడిగి, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? కలెక్టర్ ఆరా తీశారు.కేజీబీవీ పరిసరాల చుట్టూ పారిశుద్ధ్య నిర్వహణ బాగుండాలని, ఎలాంటి చెత్తచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ను కలెక్టర్ ఆదేశించారు. అన్ని కేజీబీవీ లలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.అందరికీ అన్ని అంశాలు తెలియదని, ప్రతిరోజూ చదివితే తెలియని అంశాల మీద పట్టు సాధించవచ్చన్నారు.ప్రతి పోటీ పరీక్షలో మ్యాథ్స్ తప్పనిసరిగా ఉంటుందని, ఫాస్ట్ మ్యాథ్స్ పుస్తకంలోని అంశాలను నేర్చుకుంటే గణితంలో ఉండే లెక్కల సాధన సులభ తరం అవుతుందని యూట్యూబ్ వీడియోల కంటే అన్ అకాడమీ తరగతులు చాలా ఉపయోగ పడతాయన్నారు. ప్రణాళికా ప్రకారంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అన్నీ బోధించాలన్నారుసమస్యలు ఏమైనా ఉంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులు ఆదేశించారు .ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, బి డబ్ల్యు ఓ హేమా భార్గవి, ఎంపీడీవో చెన్నారెడ్డి, గ్రామ సర్పంచ్ నరసింహులు లు,గణాంక అధికారి నవీన్ కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల రేషన్ బియ్యంపై దందా.. గజ్వేల్‌లో అక్రమ వ్యాపారిపై పీడీ యాక్ట్

**ఆరు కేసులతో నేరచరిత్ర.. చెర్లపల్లి జైలుకు తరలింపు**

**- అక్రమ రవాణాదారులకు సిపి రష్మీ పెరుమాళ్ కఠిన హెచ్చరిక**

**గజ్వేల్,జూలై,25,మెదక్ టుడే న్యూస్:(స్టేట్ బ్యూరో)** పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వ చేసి, బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ భారీ లాభాలు ఆర్జిస్తున్న ప్రధాన అక్రమ వ్యాపారిపై సిద్దిపేట పోలీసులు ఉక్కుపాదం మోపారు. బచ్చు రత్నాకర్ (46) అనే నిందితుడిపై పీడీ (ప్రివేంటివ్ డెటెన్షన్ ) యాక్ట్ నమోదు చేసి, శనివారం చెర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.పోలీసుల దర్యాప్తులో నిందితుడు తెలంగాణ రాష్ట్ర పీడీఎస్ నియంత్రణ ఉత్తర్వులు--2016 మరియు అవసర వస్తువుల చట్టం--1955 నిబంధనలను ఉల్లంఘిస్తూ రేషన్ కార్డుదారులు, రేషన్ డీలర్ల నుంచి తక్కువ ధరలకు బియ్యాన్ని కొనుగోలు చేసి, రాయిపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని వీరభద్ర రైస్ మిల్‌లో అక్రమంగా



నిల్వ ఉంచి, రీసైక్లింగ్ చేసి, అధిక ధరలకు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పేదలకు అందాల్సిన ఆహార భద్రతకు తీవ్ర విఘాతం కలిగిందని పోలీసులు తెలిపారు.నిందితుడిపై 2024లో రెండు కేసులు, 2026లో నాలుగు కేసులు నమోదై ఉండటంతో అతని నేరచరిత్రను సమగ్రంగా పరిశీలించిన సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ పీడీ యాక్ట్ అమలుకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి చెర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.అక్రమ రవాణాదారులకు సిపి స్ట్రాంగ్ వార్నింగ్"పేదల నోటి ముద్దను దోచుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. ప్రజా పంపిణీ వ్యవస్థకు విఘాతం కలిగించే అక్రమ రవాణాదారులపై భవిష్యత్తులో కూడా పీడీ యాక్ట్ సహా అత్యంత కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయి" అని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ స్పష్టం చేశారు.

# ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**సికింద్రాబాద్ :** ఉజ్జయినీ మహంకాళి అమ్మ వారి బోనాలజాతరకు అధికారులు పకడ్బందీ ఏర్పాటు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. ఆగస్టు 2 న సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర నిర్వహణ, ఏర్పాట్లపై ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆలయ పరిసరాలలో అధికారులతో కలిసి పర్యటించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మవారి దర్శనం కోసం, బోనాలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని చెప్పారు. ప్రశాంత వాతావర ణంలో జాతర నిర్వహణలో పోలీసులపాత్ర ప్రధానమైందని అన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం అదనపు పోలీసు సిబ్బందిని నియమించాలని, అత్యాధునిక పరిజ్ఞానం కలిగిన సీసీ



కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర జరిగే ఆగస్టు 2 న, ఫలహారం బండ్ల ఊరేగింపు జరిగే 3వ తేదీ సాయంత్రం పూర్తయ్యే వరకు ట్రాఫిక్ డైవర్షన్ కు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సరైన వర్షాలు కురవడం లేదన్నారు. అమ్మవారి దీవెనలతో విస్తారంగా వర్షాలు కురవాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.వివిధ శాఖల అధికారులు, డెక్కన్ మానవ సేవా సమితి, ఆర్య సమాజ్ సభ్యులు, ఆలయ కమిటీ మాజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ టాపిక్ డైవర్షన్ కోసమే కేటీఆర్‌ను టార్గెట్ చేసిన బండి సంజయ్, రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ :**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నీట్ స్కాంపై యువతకు మద్దతుగా నిరసన చేస్తే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కలిసి ఆయనను టార్గెట్ చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ ఇష్యూ జరుగుతుంటే బండి సంజయ్, రేవంత్ రెడ్డి టాపిక్‌ను కేటీఆర్ మీదకు డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు.న్యాయం కోసం పోరాటం చేస్తున్న యువతను బీజేపీ వాళ్లు తీవ్రవాదులు, విదేశీ ఫండింగ్ వస్తుందని అంటున్నారు. ఒక తండ్రిగా కేటీఆర్ ఆ యువతకు మద్దతుగా నిలిచారు.. ఆయన చేసిన తప్పేంటి..? అని ప్రశ్నించారు. కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ బండి సంజయ్, రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్‌లు పెట్టి తలతోక లేకుండా ఆరోపణలు చేస్తున్నారు. ఎవరు ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించినా కేటీఆర్ పేరు తీసి ఆయనపై ఆరోపణలు చేస్తున్నారు. నీట్ ఉద్యమం జరుగుతుంటే దాన్ని డైవర్ట్ చేయడానికి బండి సంజయ్, రేవంత్ రెడ్డి కలిసి కేటీఆర్‌ని టార్గెట్ చేశారని మన్నె క్రిశాంక్ విమర్శించారు.బండి సంజయ్, రేవంత్ రెడ్డి మంచి మిత్రులు..



బండి సంజయ్ కొడుకును పోక్సో కేసులో వెంటనే పట్టుకోకుండా రేవంత్ రెడ్డి 9 రోజులు ప్రొటెక్షన్ ఇచ్చాడు.. ఇప్పుడు బెయిల్ కూడా వచ్చిందని మన్నె క్రిశాంక్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నీట్ పేపర్ లీక్ నిరసనలు కాకుండా కేటీఆర్‌ను బద్నాం చేయాలని బండి సంజయ్, రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్‌లు పెడుతున్నారు. గత ప్రభుత్వంలో గ్రూప్-1 పేపర్ లీక్ అయితే ఆ ప్రభుత్వమే గుర్తించి, లీక్ చేసిన వారిని పట్టుకొని కేసు ఫైల్ చేసి జైలుకు పంపింది..కానీ సంబంధం లేకపోయినా 7 సంవత్సరాల నుంచి ఒకటే అబద్ధాన్ని రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కలిసి నిస్సిగ్గుగా చెబుతున్నారని మన్నె క్రిశాంక్ మండిపడ్డారు.గ్లోబరీనా కేటీఆర్ బినామీకి చెందిందని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు జేఎన్టీయూ కాకినాడనే గ్లోబరీనా సంస్థకు కాంట్రాక్టులు ఇచ్చింది. కేటీఆర్ బినామీ సంస్థ అయితే గ్లోబరీనా సంస్థకు కాంట్రాక్టులు ఎందుకు ఇచ్చారు..? అని మన్నె క్రిశాంక్ అడిగారు.2012లో కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ సమ్మిట్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఆ కార్యక్రమానికి గ్లోబరీనా సంస్థనే స్పాన్సర్ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నుండే గ్లోబరీనాతో కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధాలు ఉన్నాయి. బీజేపీ మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ గ్లోబరీనా సంస్థకు గతంలో అవార్డు కూడా ఇచ్చారు. ఈ సంస్థ ద్వారా దేశంలో ఎన్నో కాంట్రాక్టులు చేస్తున్నారన్నారు.

# సర్కారు బడులపై పెరుగుతున్న నమ్మకం.. లక్షకు పైగా ప్రైవేట్ విద్యార్థుల చేరిక, ఫీజుల భారం నుంచి విముక్తి


**హైదరాబాద్,**సర్కారు బడులపై తల్లిదండ్రుల నమ్మకం క్రమంగా బలపడుతోంది. ప్రైవేట్ స్కూళ్లపై ఉన్న భ్రమలను వీడుతున్న సామాన్య, మధ్యతరగతి వర్గాలు ప్రభుత్వ చదువుల వైపు అడుగులు వేస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేట్ స్కూళ్ల నుంచి ఏకంగా లక్ష మందికి పైగా విద్యార్థులు సర్కారు బడుల్లో చేరడం గమనార్హం. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల భారం విపరీతంగా పెరగడంతోపాటు, ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు మెరుగుపడడం, ఇంగ్లీష్ మీడియం బోధన, ఏఐ, డిజిటల్ పాఠాలు అందుబాటులోకి రావడం, టీచర్ల బోధన పట్ల విశ్వాసం పెరగడమే ఈ సానుకూల మార్పునకు ప్రధాన కారణమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలతో ప్రభుత్వ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పించేందుకు పేరెంట్స్ ఆసక్తి చూపుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు స్కూళ్ల నుంచి సర్కారు బడులకు మారిన విద్యార్థుల సంఖ్య శుక్రవారం నాటికి 1,00,174కి చేరుకుంది. అంటే సరిగ్గా లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల వైపు మళ్లారు. దీనికి భిన్నంగా



ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేటుకు వెళ్లిన విద్యార్థులు కేవలం 10,490 మంది మాత్రమే ఉండడం విశేషం. ప్రైవేట్ నుంచి సర్కారుకు వచ్చే వారి సంఖ్యతో పోలిస్తే.. బయటకు వెళ్లే వారు కేవలం 10 శాతమే ఉండటం ప్రభుత్వ బడులపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిలువెత్తు నిదర్శనమని అధికారులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.జిల్లాల వారీగా పరిశీలిస్తే.. ప్రైవేట్ స్కూళ్ల నుంచి సర్కారు బడుల్లో చేరుతున్న వారిలో నిజామాబాద్ జిల్లా ముందు వరుసలో నిలిచింది. ఇక్కడ అత్యధికంగా 8,461 మంది విద్యార్థులు ప్రైవేటును వదిలి ప్రభుత్వ స్కూళ్లలో చేరగా, ఆ తర్వాతి స్థానాల్లో జగిత్యాల 6,010 మంది, రంగారెడ్డి 5,524, కామారెడ్డి 5,284, నల్గొండ 4,919 జిల్లాలు ఉన్నాయి. రాష్ట్ర రాజధాని ప్రాంతాలైన హైదరాబాద్ 2,527, మేడ్చల్ మల్కాజిగిరి 3,538 జిల్లాల్లో కూడా గణనీయమైన మార్పు కనిపించింది. అత్యల్పంగా ములుగు జిల్లాలో 566 మంది మాత్రమే సర్కారు బడిబాట పట్టారు. మరోపక్క సర్కారు నుంచి ప్రైవేటు బడుల్లో చేరిన వారిలో ఖమ్మం జిల్లా 868 మంది టాప్‌లో ఉంది.ట్యూషన్‌లో గొడవ.. క్రికెట్ బ్యాట్లతో విద్యార్థినిలపై దాడిప్రైవేటు బడుల్లో ఆకాశాన్నంటుతున్న ఫీజులు, డొనేషన్ల భారం మధ్యతరగతి, పేద వర్గాలకు శాపంగా మారాయి. అదే సమయంలో ప్రభుత్వ బడుల్లో పెరుగుతున్న మౌలిక వసతులు, ఇంగ్లిష్ మీడియం బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌తో పాటు మధ్యాహ్న భోజనంలాంటి సౌకర్యాలు తల్లిదండ్రులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వీటితో పాటు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, వెల్‌కమ్ కిట్, ఏఐ, డిజిటల్ పాఠాలు పేరెంట్స్ ఆలోచనలను పూర్తిగా ప్రైవేటు నుంచి సర్కారు వైపు మళ్లించాయి. సర్కారు బడుల్లో చదివితేనే పిల్లల విద్యా ఫౌండేషన్ బలంగా ఉంటుందనే అభిప్రాయం బలపడుతోందని ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే రాబోయే సంవత్సరాల్లో ప్రభుత్వ విద్యాసంస్థలు పటిష్టమవుతాయని విద్యావేత్తలు భావిస్తున్నారు.

# నిట్‌కు ఎదురుగా అకడమిక్ బ్లాక్

**హనుమకొండ:** ప్రతి ష్ఠాత్మకమైన వరంగల్ నిట్ విద్యార్థుల అవసరా లకు అనుగుణంగా సౌకర్యాలను క్రమంగా విస్తరిస్తోంది. నిట్ ఔన్నత్యం ప్రతిబింబించేలా ప్రవేశ ముఖ ద్వారాన్ని నిర్మిస్తున్నది తెలిసిందే. దీనితో పాటు మరి కొన్ని నిర్మాణాలను కూడా త్వరలో చేపట్టబోతున్నది. వీటికి కేంద్రం నుంచి అనుమ తి కూడా లభించినట్టు తెలిసింది. ఇందులో ఒకటి అకడమిక్ బ్లాక్ కాగా, రెండోది రీసెర్చ్ ప్రాజెక్టు సెంటర్.నిట్ ప్రవేశ ముఖ ద్వారాన్ని రూ.3కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. సెంట్రల్ పబ్లిక్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో హైదరాబా ద్‌కు చెందిన ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ పనిని చేపట్టింది. ఆరు నెలల్లో దీనిని పూర్తి చేస్తారు. ఈ ముఖ ద్వారాన్ని హనుమకొండకు చెందిన వాయిడ్ అర్కిటెక్ట్స్ సంస్థ ప్రతినిధి రాజేశ్ డిజైన్ చేశారు. నిట్ ఉన్నతాధికారులు, సీపీడబ్ల్యు ఇంజనీర్లతో పలు సార్లు సమావేశమై దీనిని సుదీర్ఘంగా చర్చించిన తర్వాత డిజైన్‌కు తుదిరూపం ఇచ్చారు. వరంగల్ నిట్ దేశంలో అత్యున్నత సాంకేతిక కళాశాలల్లో ఒకటి. కళాశాల ఔన్నత్యం ప్రతిబిం బించేలా, భవిష్యత్తులో కళాశాల విస్తరణతో పెరిగే అవసరాలు, విలువలు, విద్యా ప్రమాణాలను దృష్టిలో పెట్టుకొని ఒక అద్వితీయమైన శాశ్వత కట్టడంగా దీన్ని నిర్మిస్తున్నారు.ఇందులో భాగంగానే ప్రస్తుతం ప్రవేశ ద్వారంగా ఉన్న కాకతీయ కళాతోరణం మధ్యలో 8అడుగుల ఎత్తైన ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ప్రతిష్టిస్తారు. కళాతోరణానికి ఇరువైపుల రెండు భారీ గేట్లతోపాటు ఇరువైపులా సెక్యూరిటీ రూమ్‌లు, టాయిలెట్లు నిర్మిస్తారు. కళాశాలలో ప్రస్తుతం పార్కింగ్ సౌకర్యం లేదు. ఈలోటు తీర్చడానికి కళాశాల లోపల కలాం గెస్ట్‌హౌస్‌కు ఎదురుగా ఎడమవైపు పార్కింగ్ కోసం ప్రత్యేకంగా విశాలమైన షెడ్డును నిర్మిస్తారు.




# తెలంగాణకు రెయిన్ అలర్ట్.

**హైదరాబాద్ :**తెలంగాణలో చాలా రోజుల తర్వాత వర్షాకాలం ఫీల్ కలుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా గత రెండ్రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసాయి. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఆసిఫాబాద్, జగిత్యాల జిల్లాల్లో రాత్రి వేళల్లో కుండపోత వర్షం కురిసింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు నమోదు కానంతగా వర్షపాతం నమోదు కావడంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో అత్యధికంగా 124 మి.మీ, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 109.5 మి.మీ వర్షపాతం రికార్డైంది.కాగా, రానున్న 24 గంటలు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రోజంతా ముసురు పడే అవకాశాలు



కనిపిస్తున్నాయన్నారు. రాబోయే మూడు గంటల్లో సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి , ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. అలాగే మెదక్, సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, సిరిసిల్ల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో తేలికపాటి మెదక్, సిద్దిపేట, జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోనూ అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు పడవచ్చునని అంచనా వేస్తున్నారు.

# తెలంగాణపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం.. పెరగనున్న ఉష్ణోగ్రతలు, రానున్న తాగునీటి కష్టాలు

**హైదరాబాద్ :**ఎల్‌నినో ప్రభావం తెలంగాణపై ఎక్కువగా ఉండనుందని, ఇప్పటికే నెలకొన్న లోటు వర్ష పాతం దీనికి అద్దం పడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వర్షాకాలమే కాకుండా మరికొన్ని నెలలపాటు దీని ప్రభావం కొనసాగనుందని అంటున్నారు. ఈ మేరకు ఇన్‌కాయిస్, ఐఎండీ-పుణె సంస్థలు ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన నివేదికల్లో పలు కీలక వివరాలను వెల్లడించాయి. సెప్టెంబరుతో వానాకాలం ముగిసినప్పటికీ వచ్చే ఏడాది మార్చి నెల వరకు ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఇన్‌కాయిస్ స్పష్టం చేసింది. తాజా అంచనాల ప్రకారం అక్టోబరు, డిసెంబరు మాసాల్లో ఇది మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.ఎల్‌నినో కారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా



నమోదుకానున్నాయని చెప్పారు. ఫలితంగా విద్యుత్ వినియోగం గరిష్ఠ స్థాయికి చేరుకునే అవకాశం ఉందన్నారు. మరోవైపు సాగు, తాగునీటి లోటు ఏర్పడి పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ఇది రైతులను ఆర్థికంగా నష్టపరిచే ప్రమాదం ఉండగా.. రైతు కూలీల ఆదాయం కూడా తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ముప్పును ముందస్తుగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా సూక్ష్మసేద్యం ద్వారా నీటిని పొదుపు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం 2026-27 సంవత్సరంలో 2,38,750 ఎకరాల భూమిలో బిందుసేద్యం ఏర్పాటు చేసేందుకు రూ.498 కోట్లను వెచ్చించేలా సమగ్ర ప్రణాళికను రూపొందించింది. ఉద్యానశాఖ ద్వారా ఇప్పటికే ఆర్థికశాఖకు నిధుల విడుదలకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించారు.ఈ రాయితీ పథకం కింద ఆయిల్‌పామ్, కూరగాయలు, మిర్చి, మక్కలు, కంది, పసుపు, సుగంధ ద్రవ్యాలు, ఉద్యాన, గులాబీ, మల్బరీ, మల్లె తోటల సాగుకు బిందు, తుంపర సేద్య పరికరాలను అందజేస్తారు. ఈ రాయితీలు వర్గాల వారీగా వర్తింపజేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 80 శాతం, ఇతర రైతులకు 70 శాతం మేర రాయితీని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.నేడు పలు జిల్లాల్లో వర్షాలు.ఇదిలా ఉండగా నేడు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షాలు కురుస్తాయని చెప్పారు. మిగిలిన జిల్లాల్లో పొడి వాతావరణం ఉంటుందని వెల్లడించారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..